క్లుప్తంగా

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీటీ ఆర్డీ ప్రమీల

ముదిగుబ్బ: స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో శనివారం ఆర్‌వైడీటీ సహకారంతో గ్రామీణ యువతకు నాయకత్వ, సాధికారతపై ఆర్డీటీ అధికారులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఏటీఎల్ కృష్ణ అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ ప్రమీల ముఖ్య అతిథిగా హాజరై యువతకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాయకత్వ పాత్రలో వ్యక్తుల నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందిచుకోవాలన్నారు. అలాగే సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని బాధ్యతగా పని చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో యువత మరియు మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం, గ్రామ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించు కోవడంలో సమష్టిగా పని చేయాలని సూచించారు. గ్రామాల్లో గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకుని బలోపేతం చేసుకుని సృజనాత్మకత మరియు మెరుగైన ఆలోచనలతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా సీఓలు రమణ, కీర్తి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

కనగానపల్లి: ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మండల అధికారి వెంకటేష్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో వెనుక వైపు ఉన్న బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

నల్లచెరువు: భారత్–పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ కుటుంబ సభ్యులను బిల్డర్ పాల్యం సుధాకర్ శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి తన వంతు సాయంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి జయంతి



పురవీధుల్లో ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలో శనివారం లక్ష్మీనరసింహ స్వామి జయంతి నిర్వహించారు. జగ్జీవన్‌రాం నగర్‌లో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం సాయంత్రం ప్రత్యేక పల్లకీపై లక్ష్మీ నరసింహస్వామిని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. పూజారి గజ్జల చిన్న తిమ్మన్న స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేపట్టారు. ఊరేగింపులో గజ్జల వంశస్థులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్కర కుంభాభిషేకం



అలంకరణలో చాదేశ్వరి దేవి

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో శనివారం చాదేశ్వరి దేవికి పుష్కర కుంభాభిషేక పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త పాటిల్ ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ కపిల్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గుడికట్టు దారులు పూజలను భక్తిశ్రద్ధలతో జరిపించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారికి వెండి, బంగారు ఆభరణాలు తొడిగి, వివిధ రకాల పూలమాలలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం 5:30 గంటలకు వేద పండితులు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మత్సం గ్రహణం, రుత్విక్ వరణం, అంకురార్పణం, అంకురార్పన హోమం, గణపతి హోమం చేపట్టారు. వాస్తు హోమం, లఘు పూర్ణాహుతి, నైవేద్యం తీర్థప్రసాద వితరణ తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

12న మల్లెపూల ఉత్సవం

కదిరి టౌన్: ఈనెల 12వ తేదీన మద్దిలేరు ఒడ్డున ఉన్న మల్లెపూల మంటపం వద్ద ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామికి మల్లెపూల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవానికి ఉభదారులుగా కదిరి వాస్తవ్యులు మల్లెపూల నరసయ్య కుమారులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు ఖాద్రీ ఆలయం నుంచి బయలు దేరి 5 గంటలకు మల్లెపూల మండపం వద్ద చేరుకోవడం జరుగుతుందన్నారు. 5 గంటలకు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజల్లో పాల్గొనాలని సూచించారు.



దిగువ చెర్లోపల్లి వద్ద నిర్మాణంలో పశువుల నీటి తొట్టె

నిర్వహణ శూన్యం.. తీరని దాహం

పుట్టపర్తి మండలం దిగువ చెర్లోపల్లి గ్రామంలో పశువుల నీటి తొట్టె నిర్మాణం అర్ధంతరంగా ఆగిపోయింది. వేసవిలో దాహం తీర్చుకునేందుకు మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. రెండు నెలల క్రితం నీటి తొట్టెల నిర్మాణం ప్రారంభం కాగా.. పూర్తి చేయకుండా నిలిపివేశారు. పల్లె పండుగ పేరుతో ఈ పథకానికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వం.. పశువుల దాహం తీర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని 14 పంచాయతీలకు సుమారు 45 నీటి తొట్టెలు మంజూరయ్యాయి. ఒక్కో తొట్టెకు రూ.35 వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వేసవి పూర్తయిన తరువాత తొట్టెల నిర్మాణం పూర్తి చేస్తారా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– పుట్టపర్తి అర్బన్:

‘ఒరిగి’ ఉన్న ప్రమాదం



కొత్తచెరువు మండలం ఇరగల పల్లి గ్రామంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం విరిగి కూలి పోయే స్థితిలో ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు. స్తంభం పడిపోకుండా గ్రామస్తులు కట్టెను అడ్డుగా పెట్టారు. విద్యుత్ స్తంభం ఇళ్ల మధ్యలో ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. స్తంభాన్ని మార్చాలని కోరుతూ గ్రామస్తులు పలుమార్లు అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అయినా సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– కొత్తచెరువు:



న్యామద్దెలకు వెళ్లే దారిలో వంతెనకు రక్షణ గోడలేని దృశ్యం

ఆదమరిస్తే అంతే..

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రం నుంచి న్యామద్దెలకు వెళ్లే దారిలో ఉన్న వంతెన కొన్ని నెలల క్రితం కురిసిన వర్షాలకు కూలింది. అధికారులు తాత్కాలికంగా మరో వంతెన నిర్మించారు. కానీ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించలేదు. అంతేకాకుండా అక్కడ వంతెన ఉన్నట్లు సమాచారం తెలిపే బోర్డు ఏర్పాటు చేయలేదు. వంతెనకు ఇరువైపులా దాదాపు ఐదు అడుగుల లోతు కాలువ ఉంది. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా... వాహనాలు అదుపుతప్పినా ప్రమాదానికి గురికాక తప్పదు. ఇక రాత్రి వేళల్లో కొత్తగా ఇటువైపు ఎవరైనా వచ్చినా వంతెన కనిపించక కాలువలో పడే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు వంతెనకు రక్షణ గోడలను నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

సలాం.. మురళి నాయక్



కదిరి టౌన్: మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త మక్బూల్ అహ్మద్



తనకల్లులో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పుట్టపర్తి టౌన్: కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: వీరుడికి మరణం లేదని దేశ రక్షణకు ప్రాణాలర్పించిన మురళి నాయక్ అమరుడని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవినాయక్ పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి సమీపంలో ప్రశాంతి గ్రామంలో ఉన్న లంబాడీ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన గిరిజన ముద్దుబిడ్డ మురళి నాయక్‌కు మరణం లేదన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఆయన స్మారక స్థూపం నిర్మించాలన్నారు. ప్రభుత్వం వారి కుటటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు విజయకుమార్ నాయక్, మండలాధ్యక్షుడు రమణా నాయక్, ట్రెజెరర్ గణానాయక్, నాయకులు నారాయణ స్వామి నాయక్, చంద్రశేఖర్ నాయక్, రమేష్ నాయక్. రవీంద్ర నాయక్, సోమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నుంచి వై జంక్షన్ వరకూ కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. భారత్ మాతాకు జై, మురళీ నాయక్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రమణ, కేశప్ప, చలపతి నాయక్, విజయ కుమార్ నాయక్, రమేష్ నాయక్ గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్‌కు నివాళి..

కదిరి అర్బన్: మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం గోరంట్ల మండలం కళ్లిపల్లితండాలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అమరవీరుడి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో కదిరి ఎంపీపీ అమరనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ అనంద్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మణికంఠ నాయక్, నాయకులు లింగాల మధుసూదన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మురళి నాయక్ మృతి బాధాకరం

కదిరి టౌన్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా యుద్ధ భూమిలో పోరాడుతూ మన రాష్ట్రానికి చెందిన మురళి నాయక్ వీరమరణం పొందడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో వీర జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, నాయకులు ఫయాజ్, మణికంఠ నాయక్, కృష్ణా నాయక్, రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

నల్లమాడ: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ–కాశ్మీర్ సరిహద్దులో పాక్ సైనికులతో పోరాడుతూ వీర మరణం పొందిన జవాన్ మురళీ నాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. శనివారం రాత్రి నల్లమాడ బస్టాండ్ కూడలిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా ర్యాలీలో పాల్గొన్నారు. మురళి నాయక్ అమర్ రహే.. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, కుళ్లాయినాయక్, షంషీర్, సలీం, శీనానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రిలో..

తాడిమర్రి: ఇండియా–పాక్ యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి చిన్నారులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బీసీ కాలనీలోని చిన్నారులు మురళి నాయక్ అమరవీరుడు అంటూ నినాదాలు చేశారు.

తనకల్లులో..

తనకల్లు: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సర్కిల్ వీర జవాన్ మురళి నాయక్‌కు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. వీర జవాన్ మురళి నాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. మురళి నాయక్‌ను దేశం మరచిపోదని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు బీఎస్ కలాం, మాధవ రెడ్డి, ముస్తఫా, శంకర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, బయారెడ్డి, సూరి, వాల్మీకి సుధాకర్, అమాన్, రెడ్డెప్ప రెడ్డి, దండోర రవి, డీలర్ నరసింహులు, ఇక్బాల్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



తాడిమర్రిలో నివాళులర్పిస్తున్న చిన్నారులు



కదిరి అర్బన్: మురళి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



పుట్టపర్తి టౌన్: నివాళులర్పిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

హిందూపురం: పట్టణంలోని విద్యానగర్ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం, నగరోత్సవం నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ కు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి అర్చనలు, పూజలు చేపట్టారు. అనంతరం లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ఆలయ ఆవరణంలో కొలువుదీర్చి భక్తులచేత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై కొలువుదీర్చి వేద పండితుడు ఉమేష్‌శర్మ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అలాగే భక్తులకు అన్నదానం చేపట్టారు. సాయంత్రం పల్లకీలో నగరోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామి ఊరేగింపు



ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని నడలూడంలో ఆంజనేయ స్వామి ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి వివిధ రకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి చిత్రపటాన్ని కాడెద్దుల బండిలో కొలువుదీర్చారు. వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



సమ్మె కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కదిరి టౌన్: లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్ రద్దు చేసి, కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సూచించారు. ఉపాధిహామీ పని దినాలు 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్ నరసింహులు, జగన్, సాంబశివ, మాబున్నీషా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కదిరి అర్బన్: పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వాల్మీకి విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా వాల్మీకి సంఘం నాయకులు నాగరాజు, పోతులయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులకు 450 మార్కులు, ప్రైవేట్ పాఠశాలలో చదివి ఉంటే 500 మార్కులు సాధించి ఉండాలన్నారు. అలాగే ఇంటర్ ప్రభుత్వ కళాశాలలో చదివితే 750, ప్రైవేట్ కళాశాలల్లో చదివి ఉంటే 850 మార్కులు వచ్చిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. మార్కుల జాబితా, కులధ్రువీకరణ పత్రం వాట్సాప్‌లో పంపించాలన్నారు. ఈనెల 18 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 25న పెనుగొండలోని మెట్ట ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9491982526 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



గుడిబండ పీహెచ్‌సీని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజా బేగం

గుడిబండ: ప్రజలు ఆరోగ్య సూత్రాలను పాటించాలని జిల్లా వైద్యాధికారిణి ఫైరోజా బేగం సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. పాము,కుక్కకాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. వేసవిలో ఎండ దెబ్బకు గురి కాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కనగానపల్లి వద్ద రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మలుపు

మలుపు.. ప్రమాదానికి పిలుపు

కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లి నుంచి ధర్మవరం వెళ్లే రహదారిలో చెరువు కట్ట సమీపంలోని మలుపు ప్రమాదకరంగా మారింది. ఈ మలుపు దగ్గర ముళ్లకంపలు పెరిగి రోడ్డు మీదకు రావటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. ఈ నేపథ్యంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు స్పందించి ముళ్ల కంపలు తొలగించటంతో పాటు ఈ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

స్వచ్ఛంద సంస్థల దాతృత్వం



మజ్జిగ పంపిణీ చేస్తున్న రెడీమేడ్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్ సభ్యులు



భక్తులకు అల్పాహారం అందిస్తున్న త్రిలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు



పానకం, రస్నా, మజ్జిగను అందిస్తున్న శ్రీసత్యసాయి భజన మండలి సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలు స్వచ్ఛంధ సంస్థలు, సంఘాల భక్తులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. భక్తులకు అల్పాహారం, ప్రసాదాలు, మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు అల్పాహారం అందించారు.

• నమో నారసింహ..



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

కదిరి టౌన్: ఓం నమో నారసింహ నామస్మరణతో ఖాద్రీ లక్ష్మీ ధరసింహస్వామి ఆలయం మార్మోగింది. శనివారం కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక, కడప, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. స్వామి కాపులు తలనీలాలు సమర్పించుకున్నారు. మహిళలు దీపాలు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసిన అనంతరం అన్నదానం చేశారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

నల్లచెరువు: మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులంతా సమష్టిగా కృషి చేయాలని కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ సూచించారు. శనివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి, మండల నాయకులు మక్బూల్ అహ్మద్‌తో ఆయన నివాసంలో సమావేశమయ్యారు. మండలంలో నెలకొన్న పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, నజీర్, హైటెక్ రమణ, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ఆదిమూర్తి, రఫి, లక్ష్మీపతి, మహ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని కురుబ సంఘం సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్మీడియేట్‌లో 900 మార్కులకు పైగా విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కులధ్రువీకరణ పత్రం, మార్కుల జిరాక్స్ కాపీలతో యశోదమ్మ వకీలు పెద్దయ్య కురుబ కళ్యాణ మండపంలో దరఖాస్తులు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 9908387330, 9440808732, 9490089523 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.